క్లుప్తంగా

3 నుంచి రీసర్వే

సిద్ధవటం : ఈ నెల 3 నుంచి కనుములోపల్లిలో రీసర్వే నిర్వహించినట్లు తహసీల్దార్ ఆకుల తిరుమలబాబు తెలిపారు. మండలంలోని కనుములోపల్లి గ్రామంలో బుధవారం మూడవ విడత రీసర్వేపై రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు రీసర్వే చేసే సర్వేయర్లకు సహకరించాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో కుప్పాల వెంకటసుబ్బయ్య, మండల సర్వేయర్ సోమశేఖర్, ఆర్ఐ ప్రసాద్, గ్రామ సర్వేయర్లు హరినాథ్, గురుసాయి, వీఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ అందజేత

గాలివీడు : మండలంలోని నూలివీడు గ్రామంలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ శాఖ రూ.2 లక్షలు ఇన్సూరెన్స్ నగదును అందజేసినట్లు బ్యాంకు మేనేజర్ రమేష్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీమలచెరువు పల్లె పంచాయతీ కమలామర్రికి చెందిన ఎద్దుల చంద్రయ్య గత కొన్ని రోజుల క్రితం మరణించాడన్నారు. అతనికి నూలివీడులోని ఏపీజీబీ నందు పీఎంజేజేబీవై పథకం కింద ఇన్సూరెన్స్ కట్టడంతో నామినీగా ఉన్న మృతుని కుమారుడు ఎద్దుల రెడ్డప్పకు రూ.2 లక్షలు ఇన్సూరెన్స్ నగదును అందజేసినట్లు తెలిపారు.

ప్రపంచ శాంతి, సమృద్ధే లక్ష్యం

ఓబులవారిపల్లె : ప్రపంచ శాంతి, సమృద్ధి కోసం సమరసతతో కూడిన సంఘటిత హిందూ సమాజ నిర్మాణం కోసం ఆర్ఎస్ఎస్ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రధాన వ్యాఖ్యాత మర్రిపాటి వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం మంగంపేట నీరుంపల్లి ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆర్ఎస్ఎస్ శత దినోత్సవం, ముందస్తు విజయదశమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పులపత్తూరి రామసుబ్బారెడ్డి, పులపుత్తూరి సుదర్శన్ రెడ్డి, ముక్కా రూపేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై రైతులకు అవగాహన ఉండాలి

పుల్లంపేట : భూముల రీ సర్వేపై రైతులకు అవగాహన ఉండాలని మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామసముద్రం గ్రామంలో రైతులకు రీసర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వేలో పట్టాలేని భూములను గుర్తించి వాటిని సర్కార్ భూములుగా గుర్తిస్తామన్నారు. అనంతరం పట్టాలు ఉన్నవారికి పాసుపుస్తకాలు అందజేస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

దుస్తుల పంపిణీ

ఓబులవారిపల్లె : మంగంపేట పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు విజయదశమి సందర్భంగా వార్డు సభ్యులు పోతుల రవిబాబు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. మహిళా కార్మికులకు చీరలు, పురుషులకు ప్యాంట్లు, షర్టులను అందజేశారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త పోతుల లక్ష్మీనారాయణ, మాజీ ఉప సర్పంచ్ పోతుల మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

లక్కిరెడ్డిపల్లి: స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ మహిళలకు వరమని ఏరియా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ సులోచన పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు ఆసుపత్రి సూపరింటెండెంట్ సులోచన ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన రోగులను పరీక్షించారు. 52 మందికి బీపీ, 51 మందికి షుగర్, ఎనిమిది మందికి క్యాన్సర్, టీబీ ఆరోగ్య పరీక్షలు, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలు చేశారు. డాక్టర్ దేవి ప్రశాంతి గైనకాలజిస్ట్ 52 మంది మహిళలకు, 44 మంది గర్భిణులకు ఆరోగ్య సేవలు అందించారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఊరట


ర్యాలీలో పాల్గొన్న అధికారులు

గాలివీడు : ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల వస్తువులకు జీఎస్టీ తగ్గించడంతో పేదలకు ఊరట లభించినట్లు అయ్యిందని ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల కేంద్రంలో జీఎస్టీ తగ్గింపు ఫలాలు పేదలందరికీ వర్తించేలా అందరికీ తెలియజేయడానికి జీఎస్టీ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

శత్రు సంహారిణి.. విజయ ప్రదాయిని

శరన్నవరాత్రి ఉత్సవాలలో తొమ్మిదో రోజు (బుధవారం) మహర్నవమిని పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో కొలువైన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేక రూపాల్లో దర్శనమిచ్చారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు వస్తుండటంతో ఆలయాల వద్ద జాతర వాతావరణం కనిపించింది. మార్కెట్, బట్టల దుకాణాలు, ప్రధాన కూడళ్లు జనంతో కిక్కిరిశాయి. కాగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీలు తీర్థప్రసాదాలను అందించారు. గురువారం దసరా సందర్భంగా ఆలయాలు విద్యుద్దీపాల వెలుగుల్లో దేదీప్యమానంగా దర్శనమిచ్చాయి.

– సాక్షి,నెట్‌వర్క్


రాజంపేట టౌన్: మీనాక్షీదేవిగా వీరచౌడేశ్వరిదేవి


నందలూరు: అమ్మవారిశాలలో రాజ్యసభ సభ్యులు మేడా


రాయచోటి టౌన్: పూజల్లో పాల్గొన్న భక్తులు


రాజంపేట టౌన్: అమ్మవారిశాలలో భక్తుల రద్దీ


సంబేపల్లె: మహిషాసురమర్దిని అలంకరణలో నల్లగంగమ్మ


పెనగలూరు: పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ


సుండుపల్లె: మహిషాసుర మర్దిని అలంకారంలో


ఒంటిమిట్ట: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీగా అమ్మవారు


చిన్నమండెం: దేవగుడిపల్లె అమ్మవారిశాలలో..


సంబేపల్లె: సీఎం కొత్తపల్లెలో చౌడేశ్వరిదేవికి విశేష పూజలు


పుల్లంపేట: ప్రత్యేక అలంకారంలో మారెమ్మ


రాయచోటి టౌన్: విజయలక్ష్మీదేవిగా వాసవీమాత


నందలూరు: అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న మహిళలు


వీరబల్లి: మండల వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో అన్నదానం


గాలివీడు మండలంలో భక్తుల ప్రత్యేక పూజలు

రైతు పరికరాలపై జీఎస్టీ తగ్గింపు

రాజంపేట రూరల్ : డివిజనల్ పరిధిలోని రైతులు తగ్గిన జీఎస్టీని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని వ్యవసాయశాఖ డివిజనల్ సహాయ సంచాలకులు కె.శివశంకర్ కోరారు. మండల పరిధిలోని పోలీ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి జి.నాగలక్ష్మి ఆధ్వర్యంలో 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్'పై రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏడీఏ శివశంకర్ జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తగ్గిన జీఎస్టీతో వ్యవసాయ ఖర్చు గణనీయంగా తగ్గుతుందన్నారు. అదే విధంగా ట్రాక్టర్ విడిభాగాలైన టైర్‌లు, హైడ్రాలిక్ పంపులపై కూడా తగ్గుతుందన్నారు. జీఎస్‌టీ కార్యాలయం రాయచోటి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఏదైనా వస్తువుల పైన జీఎస్టీ పాత ధరలతోనే విక్రయిస్తుంటే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీ పంచాయతీ సెక్రటరీ, వీహెచ్ఏ, ఏపీసీఎస్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


రాజంపేట టౌన్: మాట్లాడుతున్న అధికారి సునీత

జీఎస్టీతో సవరణతో ఆర్థిక స్వావలంభన

రాజంపేట టౌన్ : జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రతి ఒక్కరికి ఆర్థిక స్వావలంభన చేకూరుతుందని సబ్‌కలెక్టర్ సీహెచ్ భావన, జీఎస్టీ తిరుపతి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ టి.సునీత తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ సభాభవనంలో బుధవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరుతో డివిజన్‌లోని వివిధశాఖల అధికారులకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భావన, సునీత మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో నిత్యావసరల ధరలు తగ్గుతాయన్నారు.

సర్పంచ్ సొంత నిధులతో తాత్కాలిక రోడ్డు

పెనగలూరు : చెయ్యేరు వరద ప్రభావంతో ఎస్ఆర్ పురం పంచాయతీ పల్లంపాడు గ్రామ రోడ్డు కొట్టుకుపోయింది. ఆ గ్రామ ప్రజలు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోకపోవడంతో బుధవారం ఎస్ఆర్ పురం పంచాయతీ సర్పంచ్ వెలగచర్ల సుజాత, ఆమె భర్త మహేష్, జెడ్పీటీసీ సభ్యులు సుబ్బరాయుడులు స్పందిస్తూ వారి సొంత నిధులతో తాత్కాలిక రోడ్డు పనులను చేపట్టారు. మట్టిరోడ్డు వేసి గ్రామానికి రాకపోకలు కల్పించిన సర్పంచ్, జెడ్పీటీసీలను గ్రామ ప్రజలు అభినందించారు. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు పింఛా డ్యామ్ గేట్లు ఎత్తడంతో చెయ్యేరు నదికి నీరు వచ్చిన విషయం విదితమే.


తాత్కాలిక రోడ్డును వేయిస్తున్న సర్పంచ్

ఉచిత వివాహం జరిపించిన ఆకేపాటి

రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, అమరజ్యోతి దంపతులు వధూవరులకు ఉచితంగా వివాహం జరిపించి ఆశీర్వదించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లోని దేవాలయయాల సముదాయంలో బుధవారం మండలంలోని మందపల్లి పంచాయతీ వడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట చంద్రశేఖర్ కుమార్తె తేజేశ్వరీ తొగూరుపేట పంచాయతీ చింతలకోన గ్రామానికి చెందిన చింతకుంట సుబ్బరాయుడులకు దగ్గరుండి ఎమ్మెల్యే ఆకేపాటి వివాహం జరిపించారు. ముందుగా నూతన వధూవరులకు చీరె, సారె, నూతన వస్త్రాలు, తాలిబొట్టు అందజేశారు. అనంతరం వివాహానికి హాజరైనబంధువులకు ఎమ్మెల్యే భోజనాలు వడ్డించారు. అలానే మహర్నవమిని పురస్కరించుకొని దేవాలయముల సముదాయములో ఆకేపాటి ప్రత్యేకంగా హోమం నిర్వహించి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.


చీరె, సారె అందిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి దంపతులు

చెడుపై విజయానికి ప్రతీక 'విజయదశమి'

దసరా శుభాకాంక్షలు


గడికోట శ్రీకాంత్ రెడ్డి


ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : విజయదశమి పండుగ దుర్మార్గంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. లోకమాత ఆదిపరాశక్తి మహిషాసురుని సంహరించిన రోజే విజయదశమి అన్నారు. ఈ పండుగ ప్రజలలో ధైర్యం, విశ్వాసం, సంకల్పాన్ని బలపరిచే పర్వదినమన్నారు. దసరా సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తి సందేశమన్నారు. దుష్టశక్తులపై శక్తి స్వరూపిణి విజయాన్ని సాధించినట్టే, ఈ రోజు ప్రతి వ్యక్తి తన జీవితంలో ఎదురయ్యే చెడు పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలంతా భక్తి శ్రద్ధలతో ఈ పండుగను జరుపుకోవాలని, వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడి పంటలతో రైతులు, ప్రజలు సుభిక్షంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు దసరా శుభాకాంక్షలు చెప్పారు.

ఔదార్యం చాటుకున్న వైస్ ఎంపీపీ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తన సొంత నిధుల నుంచి కోడూరు వెంకటయ్యకి రూ.5000 రూపాయల పింఛన్‌ను బుధవారం డీవీ రమణ ద్వారా అందించారు. దళితవాడకు చెందిన వెంకటయ్యకు ఏడాది క్రితం ఒక కాలు తీసేశారు. పరామర్శించిన ధ్వజారెడ్డి ప్రభుత్వం ఇచ్చే వరకు ప్రతి నెలా రూ.5 వేలు అందిస్తానని చెప్పారు. ప్రభుత్వం తమను మరిచిన వైస్ ఎంపీపీ గుర్తు పెట్టుకొని పింఛన్ అందించడం పట్ల వెంకటయ్య కృతజ్ఞతలు తెలిపారు.


పింఛన్ ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జనసేనను బలోపేతం చేసుకుందాం

చిట్వేలి : జనసేనను బలోపేతం చేయడమే అందరి లక్ష్యం కావాలని రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పేర్కొన్నారు. ఇటీవల పార్టీలో చేరిన ఆనాల సునీల్ కుమార్, మాదినేని కనకరాజు, మాదినేని లోకేష్‌ల ఆధ్వర్యంలో స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జోగినేని మణి, పగడాల చంద్రశేఖర్, ఆలం రమేష్, ఏనుగుల జగన్‌మోహన్ రాయల్, పగడాల వెంకటేష్, సాదు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు 'డిజిటల్ బుక్' కొండంత అండ

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ అండగా ఉంటుందని వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు బుధవారం పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కడప పార్లమెంట్ అబ్జర్వర్ కొండూరు అజయ్‌రెడ్డితో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో అరాచకాలు పెరిగాయన్నారు. ప్రజాస్వామ్యం మచ్చుకైన కానరావడంలేదన్నారు. రెడ్‌బుక్ పాలనతో ప్రజల్లో భయాందోళన పడుతున్నారని పేర్కొన్నారు. కార్యకర్త ఎదుర్కొన్న ప్రతి వేధింపులను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి రాబోయే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి కార్యకర్తకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నుంచి అధినేత వరకు అండగా ఉంటామని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నాయకులు, కార్యకర్తలకు పెద్దపీట వేస్తామని హామీఇచ్చారు. కాగా నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించే విధంగా చూడాలని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు కొరముట్ల, కొండూరు స్పందిస్తూ కార్యకర్తల మాటను అధినేతకు చేరవేసి కోడూరులో కార్యక్రమం ఏర్పాటయ్యేలా చూస్తామన్నారు. అలానే ప్రతి వారం నియోజకవర్గంలోని కార్యకర్తలు వైఎస్ జగన్‌తో కలిసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆవిష్కరిస్తున్న కొరముట్ల, కొండూరు, నాయకులు

బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

రైల్వేకోడూరు అర్బన్ : గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో 13 కోట్లతో తాము మంజూరు చేయించిన కోడూరు పట్టణంలోని రెడ్డివారిపల్లి బ్రిడ్జి నిర్మాణాన్ని నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. వైఎస్సార్సీపీ నాయకులతో కలిసి జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులు, గుత్తేదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని బ్రిడ్జి నిర్మాణాన్ని నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటి పాలకుల పనితీరును తప్పుబట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, నందబాల తదితరులు పాల్గొన్నారు.

In the Court of the Principal Civil Judge (Senior Division), Rajampet
S.O.P.No.5/2025

1) **Kopparapu Narasimhulu** S/o Late Anjaneyulu Setty, D.No.1/320, Main Bazar, Rly.Kodur Town & Mandal, Annamayya (Dist.)
2) **Pentamsetty Lakshmi Kalyani**, W/o Nataraj, Vasavi Nagar, Vempalli Town & Mandal, Annamayya (Dist.)
3) **Pachipulusu Saravani**, W/o Kishore Kumar, Pachipulusi Textiles, Madras Road, Rajampet Town & Mandal, Annamayya (Dist)
4) **Jaladanki Leelavathi**, W/o Nageswara Rao, Main Bazar, Rly.Kodur Town & Mandal, Annamayya (Dist)

.... **Petitioners**

Vs

Nil .... **Respondent**

పై తెలిపిన పిటీషనర్లు, తమను Late Anjaneyulu Settyకి వారసులని Declare చేయమని పై తెలిపిన పిటీషను దాఖలు చేసివున్నారు. పై విషయంగా ఎవరికైనా ఎలాంటి అభ్యంతరం వున్న తేది. **14.10.2025** న పై కోర్టు నందు ఉదయం 10.30 గం.లకు హాజరై తెలుపుకొనగలరు.

By order of the Court

R.C.SURESH BABU,
Advocate, Rly.Kodur.

ఎంపీని కలిసిన నాయకులు


ఎంపీని కలిసిన ఓబులవారిపల్లె వైఎస్సార్‌సీపీ నేతలు


రైల్వేకోడూరు అర్బన్: ఎంపీ మిథున్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్ : అక్రమ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని బుధవారం రైల్వేకోడూరు వైఎస్సార్‌సీపీ మండలాల నాయకులు తిరుపతిలోని ఆయన స్వగృహంలో కలిశారు. కూటమి కుట్రల చెర నుంచి బయటకు వచ్చిన ఎంపీని రైల్వేకోడూరు మండల నాయకులు గజమాలతో స్వాగతం పలుకగా ఓబులవారిపల్లె నాయకులు పుష్పగుచ్ఛం అందజేశారు. కాగా పుల్లంపేట నాయకులు ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న పుల్లంపేట నాయకులు